# నాన్నకు చెప్పకే!

## కుంచూరి శ్రీధర్

**శిథిలమైన ఆలయాలముందు ఆర్కియాలజీ వారి బోర్డులు, విచ్ఛిన్నమైన బ్రాహ్మల ఇళ్ల వసారాలలో మిలటరీ వారి బంకర్లు తప్ప పెద్ద సందడిగా లేదక్కడ.**

పై నుంచి మల్లెలు తెంపిపోస్తున్నట్టు తెల్లటి మంచు కురుస్తోంది. కొండల్లో,కోనల్లో తన రూపం పరిచేస్తూ పాతఅందాలను సరిచేస్తున్నట్టు అదో అద్భుతంగా ఉంది. ఆ ప్రకృతిమాతకి ఎవరు పులకించరక్కడ.....?

కాలిబాట అందంగా ఉన్నా...కరుడు గట్టిన మంచురాళ్లతో నడవడానికి కష్టంగా వుంది. ఒక వృద్ధుడు వడివడిగా అడుగులేస్తూ ఆ ఊరి చౌరస్తాకు చేరుకున్నాడు. వయసు పండిన ఆ బ్రాహ్మణుడు పాత కాలపు ఓ నాటుబడి మాస్టరు. కాశ్మీరీభాషలో 'బడుగు బాపడోయ్....బక్కపంతులోయ్..." అంటూ అరుస్తూ ఆయన్నే వెంబడిస్తున్న పిల్లలతో ఆ వీధి అంతా గోలగా వుంది. ఆయన మాత్రం వెనుదిరిగైనా చూడటం లేదు. ఆయనకు తెలుసు, తను వెనుదిరిగే ప్రయత్నం చేస్తే చేతికర్రకు అందేంత దూరంలో ఉన్న పిల్లలు పరుగెత్తే ప్రయత్నంలో మంచురాళ్లపై పడి గాయాలు చేసుకుంటారని. అందుకే కరుణామయుడిలాగా ఆయనలో బోసినవ్వు తప్ప మందలించే ప్రయత్నమే లేదు.

మైనస్ నాలుగుడిగ్రీల చలి. పాతవై చిరిగిన ఆయన ఉన్నితొడుగుల వల్ల పాదాలు, చేతివేళ్లు వాచి భారంగా తెలుస్తున్నాయి. ఖాదర్‌అలీ దుకాణం వరకూ చేరుకున్నాడు. ఒక బెంచీ ఖాళీగా ఉందక్కడ. కూర్చోబోయాడు. శరీరం బిగుసుకుపోయినట్టె విపరీతమైన వణుకుతో వశం తప్పి తూలిపోయాడు. ఆ యువకుడు ఎవరో పరిచయస్తుడల్లే వున్నాడు. వెంటనే లేవనెత్తుతూ మంచు దులిపి కూర్చోబెట్టాడు. అతను తొడుక్కున్న ఫరాన్ (కాశ్మీరీ ఉన్నివస్త్రం) పంతులుకు తొడిగాడు. వెచ్చటినీరు తెప్పించి... చేతులు, పాదాలు అందులో కాసేపు వుంచి తుడుస్తూ తన 'కాంకిడి' (చినారు ఆకులు కాల్చి ఆ సన్నటిబొగ్గు నింపిన పొగరాని ముచ్చటైన మొబైల్ చేతి కుంపటి) ఆయన చేతికి ఇచ్చాడు.

కాస్త తేరుకున్న మాస్టారు కళ్లజోడు ఆత్రంగా తగిలించుకుని నిశితంగా గుచ్చి చూస్తూ....

"ఎవరూ.....జా...వే...ద్ !!" కృతజ్ఞతగా ఉంది ఆ పిలుపు . జావేద్ వేడివేడి నమికిన్‌ఛాయ్ (ఉప్పు, పాలు,సోడా, టీపొడి, కలిపి కాశ్మీరీలు తాగేది) చేతికి అందిస్తూ ...." ఔనండీ మాస్టారు చలి మైనస్ దాటింది కదా. మీ అబ్బాయి శంకర్‌జీని పంపకపోయారా? ప్రేమగా అన్నాడు జావేద్.

"కాస్త దూరమె గద రాగలననుకున్నానయ్యా! బెంచిపై కూర్చుంటూ నీరసంగా అన్నాడు మాస్టారు. ఆయన తూలిపోయే ముందు ఏ ఆసరా దొరక్క ఎంతగా వెంపర్లాడాడో పాపం రాయిలా బిగిసిన మంచుగడ్డ తగిలేమో నొసటన వాచి బుడిపెగా లేచింది.

జావేద్ మనసుకు బాధనిపించిందేమో..." సరుకులు తీసుకోండి మాస్టారూ..... ఇంటి వరకు అలా నేనూ వస్తాను. "అన్నాడు.

"ఎందుకు నాయనా శ్రమ... ఎలాగోలా నేను వెళ్తాను."

"ముందు మీరు తీసుకోండి మాస్టారూ వెళదాం..."తొందరించాడు జావేద్. అయితే మాస్టారెందుకో ఇబ్బంది పడుతున్నాడు. ఆయన పై కండువా కొసన మూటకట్టిన చిల్లరంతా ఓ మూలకు తోసి తీసుకుంటూ... "అరకిలో బియ్యం...నాలుగుఅణాల పెసలు," కాస్త మెల్లగా ఖాదర్‌అలీకి మాత్రమే వినిపించేలా అన్నాడు.

ఖాదర్‌అలీ విసురుగా అరకిలో బియ్యం ఆయన బాగులో పోస్తూ 'నాలుగణాల పెసలేంటయ్యా దిక్కుమాలిన బేరం' అంటూనే కాసిన్ని పెసలు చిరాగ్గా బాగులో విసిరాడు.

మాస్టారు ఇచ్చిన చిల్లర ఖాదర్‌అలీ మరోమారు లెక్కపెట్టి "ఏంటి పంతులు....పదిహేను పైసలు తక్కువున్నాయి. " విసుక్కుంటూ ఆ చిల్లర మాస్టారి గుప్పిట్లో పోసేసి ఆయన మరో చేతిలోన్ని బాగును లాగేసుకోబోయాడు.

మాస్టరే చేతికి తగిలించుకున్న బాగును తీసి ఇచ్చేస్తూ "సరిగానే లెక్కపెట్టి తెచ్చానయ్యా... " అభ్యర్ధనగా చూస్తూ సంజాయిషీగా అన్నాడు.


"సరే లేవయ్యా అర్ధణా బేరానికి అణా దండగ . అంతా హరిశ్చంద్రులే! "ఖాదర్‌అలీ వ్యంగ్యంగా దీర్ఘం తీశాడు. అక్కడున్న అందరూ మాస్టారి ముఖంలోని దైన్యాన్ని సానుభూతిగా అదో వింతగా చూస్తున్నారు. అంతమందిలో మాస్టారికి తల తీసేసినట్టయినా కళ్లనిండిన తేమ కన్నీరుగా మాత్రం రాలేకపోతోంది. గతాన ఇంతకన్నా దారుణమైన అనుభవాలు ఎన్నెన్నో ఆయనకి.

తన పాతికేళ్ల కొడుకుని పోలీస్ ఇన్‌ఫార్మర్ అన్న అనుమానంతో ఉగ్రవాదులు కాల్చి చంపినప్పుడు తన పూర్వీకుల ఒకే గుర్తుగా మిగిలిపోయిన ఎన్నో సంప్రదాయహంగుల గుడిలాంటి తన ఇల్లు తన కళ్ల ముందే తీవ్రవాదులు పేల్చేసినపుడు, ఏళ్లుగా పెంచుకున్న తన ఎకరం ఆపిల్‌చెట్లని మొదళ్లకే నరికేసినప్పుడు, ఆ వృద్ధుడు

తన కన్నీటిని మిగిల్చుకోలేదేమో...... ఇలాటి  గతికోసం...

ఇదంతా చూస్తున్న జావేద్ మనసంతా బాధతో నిండిపోయింది.

గుండె బరువెక్కింది. ఒక్క ఉదుటున వెళ్లి ఖాదర్‌అలీ చేతిలోని సంచిని లాగేసుకుని



ఉగ్రుడైపోతూ తక్కువపడ్డ చిల్లర విసిరి పడేశాడు. గుమికూడిన అందరూ అదోలా చూస్తుంటే మాస్టర్ని తీసుకుని కదిలాడు జావేద్.

దారిలో "నేను సరిగానే లెక్కపెట్టి తెచ్చానయ్యా....." మాస్టారి పెదవులు బలహీనంతో అదురుతుంటే "....నీవైనా నమ్మ్మ బాబూ...." అన్నట్టు బాధగా అన్నాడాయన.

"నాకు తెలుసు మాస్టారూ...నిష్కల్మషం మీరు....దాని ఆకారం మీరే..."బాధగా అన్నాడు. మాస్టారి కంఠం ఆర్ద్రంగా వణికింది.

దారిలో మరో ఇద్దరు యువకులు కలిసి మాస్టారికి నమస్కరించారు. మాస్టారు గుర్తు పట్టకపోయేసరికి "కులబీర్‌సింగ్, కరీమ్ మాస్టారూ...నాతోపాటు మీదగ్గర చదువుకున్నారు" గుర్తు చేశాడు.

"ఓ మీరా.... ఎంత ఎదిగారయ్యా...ఎప్పుడో లాగులు వేసేటప్పుడు చూశాను." చనువుగా దగ్గర చేర్చి ఆప్యాయంగా భుజాలు తడిమాడు ఇద్దర్నీ..

"ఈ ఊళ్లోనే ...బి.ఏ చేస్తున్నాను. మాస్టారూ...మీ అమ్మాయి లక్ష్మిగారు కూడా మా క్లాస్‌మేటే..." కులబీర్ అన్నాడు. కరీం కల్పించుకుని " అన్నట్టు మాస్టారూ..మొన్నెవరో లక్ష్మిగారిని...." అంటూ మధ్యలో ఆపేశాడు.

"అవమానించారయ్యా...పైటలాగటం, వెంబడించడం..అనరాని బూతులతో అమ్మాయిని తెగ ఏడిపిస్తున్నారట. అది రోజా ఆసుపత్రిలో పడివున్న తన తల్లితో చెప్పి ఏడుస్తుంటే దానికున్న జబ్బుకు తోడు మరింత చిక్కిశల్యమౌతోంది. ఈ అవమానాలకు బాధలకు అతీతంగా నన్ను ఆ భగవంతుడైనా రమ్మనడు...." మాస్టారికంఠం గద్గదమైంది. ఆయన ఒళ్లంతా బలహీనంగా అదురుతుంటే ఆ చివరిమాటలు పీలబోయాయి.

"మాస్టారూ...!"ఆర్ద్రంగా పలికారు ముగ్గురూ. ఆవేదన ఏదో తామే అనుభవిస్తున్నంతగా...

"ఔనయ్యా...బలహీనులు కడకు హీనులే...."

"లేదు మాస్టారూ...మేము ఊళ్లో లేకపోబట్టి సరిపోయింది. ఉండివుంటే వెధవల్ని అక్కడే నరికి వేసేవాళ్లం...."ఆవేశంతో ఉగ్రులయ్యారు.

"ఆవేశం వద్దు నాయనా... ఏదో రోజున పశ్చాత్తాపంతో అలమటిస్తారు. సరేలేగానీ.... మీ చదువులెలా వున్నాయి? " మాస్టారే మాటమార్చారు వారి ఆవేశం చూసి...

"ఈ చదువులదేముంది మాస్టారూ. మేము గుత్తంగా దాచుకుంది ఒక్క మీ బెత్తం చదువులే! జీలంనదిపై తేలియాడె ఆనాటి  మా పడవబడి, ఆ ఒడ్డునే మేం పెంచిన పూలదడి.... ఆ ఎదుటే కన్పించే

మంచుకొండల్లా మా చిన్న గుండెల్లో అమాయకత్వం ...అప్పటి భయాలు... అవేవో తియ్యటి రోజులు. ఆ రోజులు ఏ యజ్ఞం, మరే తపస్సు చేస్తే మాత్రం తిరిగి రాగలవు."గాఢంగా నిట్టూర్చాడు కులబీర్

"ఔను మాస్టారూ... ఓ గల్లీ కట్టచ్చు ...మతం మార్చవచ్చు. మరొకణ్ని ఖతం చేయొచ్చు. గానీ గతాన్ని మన జతకు తేలేము కదా!" ఆ పాతస్మృతి ఉద్రిక్తతలో కరీం కూడా ఏదో అనేశాడు.

మాస్టారికి అప్పటి తన గౌరవం, హోదా, సుఖమయజీవితం మనసును ఊపాయో ఏమో, అనుకోకుండా లొట్టలు పడిన ఆ వృద్ధుడి కళ్లలో నిండుగ నీళ్లు చిప్పిల్లాయి.

ఆ కాస్సేపు గుండెల్లో నిండుపున్నమి పూసిందో ....ఆయన మదిమెలికల్లో అది మధురానుభూతులు రేపిందో....! మౌనంగా ఉండిపోయాడు.

"మాస్టారూ! మన కాశ్మీర్ గురించి అప్పుడు అన్నన్ని కథలు, కవితలు రాశారే! ఈ మధ్యన మానేశారేం..." అడిగాడు కులబీర్.

వెంటనే కరీం కల్పించుకుని "ఏమని రాస్తార్రా.....! ఇక్కడ చొరబడ్డ విదేశీతొత్తుల గురించా.....నిత్యం జరిగే ఈ రణగొణధ్వనుల గురించా... మనలో మనం కాల్చుకుచావడానికి తెచ్చుకున్న ఈ పక్కదేశపు తుపాకుల శబ్దాలు నీ పుడమితల్లి మెడ నులిమేయ్. నీ తల్లి భారతి తల నరికేయ్ ......అంటున్నాయని వినమనా? ఏమని రాస్తార్రా?" గంభీరమైన కంఠంతో కోపంగా అన్నాడు. మాస్టారెందుకో మౌనంగా ఉండిపోయాడు.

"బయటే నుంచున్నారే.....లోనికి రండర్రా...." ఇంటి ముందే నిలుచుకుని మాట్లాడుతున్న వాళ్లని లోనికి ఆహ్వానించాడు మాస్టారు.

"అమ్మాయ్....లక్ష్మీ .....కాస్త వేడి పాలుంటే తేమ్మా...."

"ఎందుకు మాస్టారూశ్రమ." అంటూనే పుచ్చుకున్నారు. మూడు రెళ ఆరు[illegible]ల ఖాళీగ్లాసులు కిందపె[illegible] పట్టేడుకూర నేలపాలయినట్టయింది ల[illegible]. పా[illegible] తండ్రి తెచ్చిన ఆ కాసినిబియ్యానికి ఆ పాలే పాయసంగా తోడయ్యుండేవి మరి.

మాస్టారికి ధన్యవాదాలు చెప్పి ముగ్గురు బయలుదేరుతూ "అన్నట్టు మాస్టారు....అమ్మగారు పెద్దాసుపత్రిలోనేగా ఉండటం.... కాస్త పలకరించి వెళ్తాం...." అంటూ లేచారు.

అంతలో లక్ష్మి అటుగా రావడం చూసి, "లక్ష్మిగారూ!మాకు చాలా కన్‌ఫ్యూజన్‌గా ఉందండి. అక్కడి నంబరు కాస్త చెప్పరూ!" కరీం వినయంగా అడిగాడు.

అతని మాటలకు లక్ష్మి ఏమనుకుందో మౌనంగా వుండిపోయింది.

"మీరు చెప్పందే కనుక్కోవడం చాలా కష్టమండి..." రిక్వెస్ట్ చేస్తున్నట్టు అన్నాడు కులబీర్.

మాస్టారు వీళ్ల తికమకను అర్థం చేసుకుని "అదేనమ్మా....మీ అమ్మ వార్డు, బెడ్ నంబరు....కాబోలు..అదీ... అయిదవవార్డులో పద్నాలుగో నంబరయ్యా"

"థాంక్స్ మాస్టారూ ఉంటాం మరి!"

"మంచిదయ్యా...." వెళ్లబోతున్న ముగ్గురూ మాస్టారు పాదాల్ని ఓ మారు తాకి కళ్లకు అద్దుకున్నారు. ఆ సంఘటనకు ఎన్నడూ ఎరగని ఆనందం, ఆప్యాయతలు పెల్లుబికాయో ఆయనలో.... చటుక్కున ఆలింగనం చేసుకున్నారు. ఆనాటి బుల్లిబుల్లి చిన్నారులేనా ఇంతటి వ్యక్తిత్వం సంపాదించుకున్న రూపాలు....? ఎంత సంస్కారం....! మరెంతగానో ఎదిగిపోయారు. మితిమీరిన ఆత్మీయత సతమతం చేస్తుంటే మతిమరచి చూస్తూ వుండిపోయారు మాస్టారు.

తండ్రి ముఖంలో అంతటి సంతృప్తిని చూసుకుని ఎన్నేళ్లయిందో లక్ష్మికి.. అయితే ఎందుకో లక్ష్మి ముఖం బాగా కందివుంది. దుఃఖం పెల్లుబికి రాబోతోంది. తండ్రి కలవరపడకుండా దూరంగా వెళ్లి కూర్చుంటూ ఆగని వెక్కిళ్ల మధ్య అనుకుంది. "పిచ్చినాన్న...ఎలా ఎలా చెప్పను నాన్నా! మీ రచనలమ్మి తెచ్చిన ఆ కాస్త బియ్యాన్ని దారిలో పారబోసి మీ ప్రియశిష్యులు ఇసక పోసి తెచ్చారని... వాళ్లంతా ఆప్యాయంగా అడిగింది మీ భార్య బెడ్ నంబర్ కాదు నాన్నా మీ కూతురి ఎదకొలతలని..వాళ్లలా అలవాటుగా అదే అడిగి ఏడిపిస్తుంటారని....మీరు నమ్మే ఆ కాలం మనుషులు..ఇకలేరని...ఎలా చెప్పను నాన్నా...! మన పేదబతుకుల అసహాయతని...ఆమె గుండె రగిలిపోతోంది. దుఃఖం ఆపుకున్నా వెక్కిళ్లు తెగనీయకుండా. అక్క విలపించడాన్ని ఆందోళనగా చూస్తూ భయంగా నుంచున్న పన్నెండేళ్ల శంకర్‌కు ఏమీ అర్థం కావడంలేదు. ఆ రోజు పైటలాగింది ఇందాకటి వాళ్లే కదా. తప్పు చేస్తే నాన్నకు ఎంత కోపం! వారినలా ప్రేమగా చూస్తారేం?

"చిన్నా ఇలారా..." నీరు నిండిన కళ్లతో మమకారాన్నే మాటగా పిలిచింది తమ్ముణ్ని.

శంకరం మౌనంగావచ్చి లక్ష్మి ఒడిలో తల ఆన్చి ముడుచుకుపడుకున్నాడు.

"చిన్నా! " తమ్ముడి తల నిమురుతూ అంది.

"ఊఁ...."

"నాన్నకు చెప్పకేఁ...." ముద్దుపెట్టుకుంది లాలనగా..... ■

## డాక్టర్ - డాక్టర్



డైట్ థెరపీ, మాగ్నటో థెరపీ, యోగా థెరపీ, ఆక్యుపంచర్‌లలాంటి ప్రకృతి సంబంధ వైద్య విధానాలకు సంబంధించిన సమస్యలు, సందేహాలకు ప్రముఖ ప్రకృతివైద్యనిపుణులు

**డా॥ జి.గణేష్ బి.ఎన్.వై.ఎస్., ఎం.డి.**

జవాబులివ్వనున్నారు.

**మీ ప్రశ్నలు**
**డాక్టర్-డాక్టర్,**
**ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక,**
**ఎక్స్‌ప్రెస్ సెంటర్, దోమల్ గూడ,**
**హైదరాబాద్-29.**